
TIRUMALA TIRUPATI DEVASTHANAMS
తిరు రుపతి
దేవస్థాన ులు
తిరుపతి

శ్రీనివాస బాలభారతి - 13

# మదాలస

రచన

సముద్రాల లక్ష్మణయ్య

ప్రధానసంపాదకుడు

డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్య

ప్రచురణ

కార్యనిర్వహణాధికారి

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

2004

ŚRĪNIVĀSA BĀLABHĀRATI - 13
(Children Series)

# MADĀLASA

By
**Samudrala Lakshmanaiah**

Chief-Editor:
Dr. S.B. Raghunathacharya

T.T.D. Religious Publications Series No. 77

First Edition : 1980
Re-prints : 1997, 2004

Copies: 10,000

*Published by*
Sri Ajeya Kallam, I.A.S.,
Executive Officer,
Tirumala Tirupati Devasthanams,
Tirupati.

Art :

*Printed at*

Sri Venugopala Offset Printers
VIJAYAWADA, PH : 5511302.

# ముందుమాట

చిన్నపిల్లల మనసులు చల్లనైనవి, నిర్మలమైనవి. చక్కగా పెరిగిన పిల్లలు భావిభారత పౌరులై మంచి సభ్యత సంస్కారం పెంచుకొని, తమ కుటుంబానికి, దేశానికి కూడ పేరుప్రతిష్ఠలను సంపాదించి గర్వకారణమవుతారు. మన ఇతిహాసాల్లోని మహాపురుషులు, మహాపతివ్రతలు ఎలాంటివారు, వారంత గొప్పవారెలా అయినారనే విషయం చారిత్రకథను చెపుతూ పిల్లలకు తెలియజేయగలిగితే, దాని ప్రభావం లేతమనస్సులపైన చక్కని సంస్కారముద్రలను వేయగలుగుతుంది. అవి భవిష్యత్తులో వారికెంతగానో ఉపయోగపడతాయి.

ఈ ఉద్దేశ్యంతోనే ''శ్రీనివాస బాలభారతి'' అనే పుస్తకమాలను తిరుమల తిరుపతి దేవస్థానం ప్రకటిస్తోంది. ఇందులో మన భారతదేశంలో అనేక ఆదర్శాలకు ప్రసిద్ధులైన మహాత్ముల చరిత్రలు చిన్న చిన్నవాక్యాలలో చక్కని కథాకథన పద్ధతిలో చెప్పడం జరుగుతుంది. చిన్నారి బాలలు వీటిని బాగా ఉపయోగించుకుంటారని ఆశిస్తున్నాం.

ఈ ప్రణాళికను రూపొందించి, రచనలను తయారు చేయించి, వాటిని కావలసిన పద్ధతిలో సంపాదించిన, డాక్టర్ ఎస్.బి. రఘునాథాచార్యగారికి నా అభినందనలు. ఈ ప్రణాళికలో మాతో సహకరించిన రచయితలకు, కళాకా[illegible] ధన్యవాదాలు.

ఈ పుస్తక ప్రతులు చెల్లిపోయినందున పునర్ముద్రిస్తున్నాం. ఆసక్తిగల బాలలతోపాటు అందరినీ అలరిస్తుందని మా ఆకాంక్ష.

**కార్యనిర్వహణాధికారి**

తిరుమల తిరుపతి దేవస్థానములు, తిరుపతి.

# స్వాగతం!!

శ్రీనివాసదయోద్భూతా బాలానాం స్ఫూర్తిదాయిని ।
భారతీ జయతాల్లోకే భారతీయగుణోజ్జ్వలా ।

ఖండ ఖండాంతరాల్లో నాగరికత కన్నువిప్పనాటికే సభ్యతకు, సంస్కారానికి, నైతిక-ధార్మికాదర్శాలకు పేరుపడ్డది మన భరతఖండం. ఈ గడ్డపై పుట్టిన ప్రతిమానవుడు అధర్మాన్ని ఎదిరిస్తూ, ధర్మాచరణంలో తన జీవితాన్ని పండించుకొని, మాధవాభిముఖంగా నడచి మహనీయకీర్తి నార్జించినవారే. అలాంటి మహాత్ముల సన్నిధి మన మది సంతోషాలకు పెన్నిధి. కనీసం వారి జీవితాదర్శాలు మనస్సుల్లో మెదిలితే వాటిప్రభావం మనమీద ఎంతో ఉంటుంది. 'నేను భారతీయుణ్ణి,' 'ఇది తర తరాలనుండి వస్తున్న నా సంప్రదాయం', 'ఇది నా కర్తవ్యం' అని ప్రతి బాలుడు, బాలిక, ఈ దేశసేవకు తనను అంకితం చేసుకుంటారు.

నిజానికి ఈ దేశంలో ఎందరో మహామునులు, మహాపురుషులు, మహాపతివ్రతలు, మహావీరులు పుట్టి, పెరిగి, చక్కని సంస్కృతికి పునాదులు వేశారు. స్వచ్ఛమైన జీవనవాహినిని మనదాకా ప్రవహింపచేశారు. ఆహా! మనమెంత అదృష్టవంతులం! మన వెనుక ఎంత ఉదాత్తమైన చరిత్ర ఉంది! ఆ పుణ్యపురుషులు, మహాసాధ్వులు ఇక్కడ పుట్టకపోతే మనదిగా

మనం చెప్పుకొనే మహత్తరమైన ఈ సంస్కృతి, సభ్యత మనకెలా సంక్రమించేవి? వాళ్లను అర్థం చేసుకోవడం, వాళ్ల చరిత్ర మననం చేసుకోవడం, వారి ఆదర్శాలు స్మరించడం కూడ మనకు గొప్ప విజ్ఞానాన్నందించే విద్యాభ్యాసం. అది ముందు ముందు మనజాతి జీవనప్రవాహంలో కొన్ని ఏండ్లదాకా చెక్కుచెదరని స్ఫూర్తిసౌరభాలను విరజిమ్ముతుంది. అందుకే శ్రీనివాసబాలభారతి ఉదయించింది. ఎందరో మహాపురుషుల్ని మీముందుంచుతోంది. ఇక మీదే ఆలస్యం. బాలలూ! రండి! రండి!

నిండుమనస్సుతో మీకిదే మా స్వాగతం!

ఎస్. బి. రఘునాథాచార్య
ప్రధానసంపాదకుడు

7

మనం పిల్లలకు అందమైన పేర్లు పెట్టుకోవాలని చాలా తాపత్రయపడుతుంటాం. వెతికి వెతికి ఎలాగో ఒక పేరు స్థిరం చేస్తాం. ఒక తండ్రి అలాగే తన బిడ్డలకు ఆలోచించి మంచి పేర్లను పెట్టాడు. ఆ పేర్లు విని పకపకా నవ్వింది ఆయన ఇల్లాలు. అవన్నీ పనికిరాని పేర్లన్నది. ఆత్మస్వభావానికి ఆ పేర్లకు పొత్తుకుదరడం లేదన్నది. ఆ మహాగామతల్లి మన ఇతిహాసంలో జ్ఞానమూర్తిగా మహనీయస్థానాన్ని సంపాదించుకొన్నది. ఆమె ఎవరో తెలుసా? మదాలస. జోలపాటలతోనే కన్నబిడ్డలకు ఆత్మతత్త్వాన్ని చల్లగా అందించి, తన కడుపున పుట్టిన పిల్లలు మళ్లా గర్భనరకం అనుభవించకూడదని మహా తత్త్వజ్ఞానులుగా వాళ్లను రూపొందించిన ఆదర్శమాతృమూర్తి ఆమె. ఆమె మన తల్లులకు ఆదర్శం కావాలి. ఇక చదవండి —

— ప్రధానసంపాదకుడు

# మదాలస

యద్యోగిభి ర్భవభయార్తి వినాశయోగ్య
మాసాద్య వందిత మతీవ వివిక్తచిత్తైః ।
తద్వః పునాతు హరిపాదసరోజయుగ్మ
మావిర్భవత్క్రమవిలంఘితభూర్భువస్స్వః ।

ఋతధ్వజుడు :

పూర్వం శత్రుజిత్తు అనే మహాపరాక్రమశాలి అయిన ఒకరాజు వుండేవారు. అతడు అనేక యజ్ఞాలుచేసి దేవేంద్రాదిదేవతలను సంతోషింపచేశారు.

ఆ భూపాలుడికి ఋతధ్వజుడు అనే కుమారుడు జన్మించారు. వివేకంలోనూ, విక్రమంలోనూ, సౌందర్యంలోనూ ఆ రాకుమారుడు సాటిలేని మేటి అనిపించుకొన్నారు. సమవయస్కులైన రాజపుత్రులతో చేరి అతడు సదా సంగీత సాహిత్యశాస్త్రాదిచర్చలతో కాలం గడుపుతూ వుండేవారు.

నాగకుమారులతో మైత్రి :

ఒకసారి నాగలోకాధిపతి అయిన అశ్వతరుని పుత్రులు ఇరువురు

నాగకుమారులు భూలోకానికి వచ్చారు. ఋతధ్వజుడికి వాళ్లతో మైత్రి ఏర్పడింది. ఆ మైత్రి క్రమంగా నానాటికీ వర్ధిల్లింది. నాగకుమారులు నిత్యమూ భూలోకానికి వచ్చి అతనితో వినోదంగా కాలం గడిపి తిరిగి తమ లోకానికి పోయేవారు. ఇలా అనేకదినాలు గడిచాయి.

మనమేమివ్వగలం ?

ఒకనాడు అశ్వతరుడు "భూలోకంలో మిమ్మల్ని ఇంతగా ఆకర్షించిన వ్యక్తి ఎవరు?" అని కొడుకులను ప్రశ్నించారు. వాళ్లు ఋతధ్వజుడి గుణగణాలను విశేషంగా వర్ణించి అతని సౌజన్యమే తమ గాఢమైత్రికి కారణమని చెప్పారు. వాళ్లు చెప్పింది విని నాగరాజు ఋతధ్వజుని మంచితనానికి ఎంతో మెచ్చుకొన్నారు. అలాంటి సత్పుత్రుని కన్న తండ్రి నిజంగా ధన్యాత్ముడనుకొన్నారు. తన పుత్రుల ప్రీతికి పాత్రుడైన ఋత ధ్వజుణ్ణి సంతోషపెట్టడానికి ఏదైనా ఒక మేలుచేస్తే బాగుండునని భావించారు. ఏదైనా ఒక గొప్ప బహుమానం అతడికి సమర్పించవలసిందిగా కుమారులను కోరారు.

ఋతధ్వజుడు సర్వైశ్వర్యసంపన్నుడనీ, లోకంలో అతడికి సమర్పించ దగిన బహుమానమంటూ ఏదీ లేదనీ నాగకుమారులు తండ్రితో చెప్పారు. ఐతే ఒక్క కార్యం చేస్తే మాత్రం అతడు సంతోషిస్తాడనీ, ఆ కార్యం హరిహర బ్రహ్మలకు తప్ప ఇతరులకు అసాధ్యమనీ కూడా వాళ్లు తండ్రికి నివేదించారు

ఆ కార్యం ఏమిటో తెలియజేయమని నాగరాజు వాళ్ళను అడిగాడు. అందుకు నాగకుమారులిలా అన్నారు —

గాలవుని వెంట ఋతధ్వజుడు :

తండ్రీ! ఋతధ్వజుని తండ్రిపేరు శత్రుజిత. ఒకనాడు ఆయన దగ్గరకు గాలవుడు అనే విప్రవరేణ్యుడు వచ్చాడు. అతనివెంట ఒక మేలైన గుఱ్ఱం గూడా వున్నది. ఆ భూసురుడు శత్రుజిత్తుతో ఇలా విన్నవించాడు–

రాజా! ఒక రాక్షసుడు సింహ శార్దూలాది క్రూరజంతువుల రూపంతో వచ్చి నా ఆశ్రమాన్ని ధ్వంసం చేస్తున్నాడు. నా తపస్సుకు భంగం కల్గిస్తున్నాడు. నన్ను పలువిధాల వేధిస్తున్నాడు. కోపాగ్నితో వాణ్ణి దగ్ధంచేసే శక్తి నాకు వుంది. అయినా చిరకాలార్జితమైన తపస్సు వ్యర్థమవుతుందన్న భయంతో అందుకు నేను పూనుకోలేదు

ఒకసారిమాత్రం మిక్కిలి విచారంతో ఆకసంవైపు చూస్తూ ఒక నిట్టూర్పు విడిచాను. వెంటనే పైనుండి ఈ గుఱ్ఱం నేలపై వ్రాలింది. నెను వెంటనే ఆకాశవాణి నన్ను ఇలా హెచ్చరించింది. —

"ఓ మహర్షీ! సూర్యభగవానుడు నీ కొఱకు ఈ గుఱ్ఱాన్ని పంపాడు. ఇది సమస్తభూవలయాన్నీ ఒక్కక్షణంలో చుట్టివస్తుంది అందువల్లనే దీనికి

'కువలయం' అన్న పేరు సార్థకమయింది. శత్రుజిత్తుని పుత్రుడైన ఋతధ్వజుడు ఈ అశ్వాన్ని అధిరోహించి మిమ్మ బాధించే రాక్షసుల్ని సంహరిస్తాడు ఈ అశ్వంవల్ల ఆ రాకుమారుడికి 'కువలయాశ్వుడు' అనే ఖ్యాతి కల్గుతుంది. అతని కీర్తి నలుదిక్కులా వ్యాపిస్తుంది."

"మహారాజా! గగనవాణి మాటప్రకారం నేనివ్వాళ నిన్ను ఆశ్రయించాను. ఈ అశ్వరత్నాన్ని మీకు సమర్పిస్తున్నాను. రాక్షసబాధ నివారించి నన్ను కాపాడు. నీ పుత్రుణ్ణి ఈ పనికి వినియోగించి నన్ను అనుగ్రహించు"

ఇలా ప్రార్థించిన గాలవుణ్ణి రాజు అనుగ్రహించాడు. కుమారుణ్ణి అశ్వంపై కూర్చోబెట్టి అతనివెంట పంపాడు. గాలవుడు ఋతధ్వజుణ్ణి తన ఆశ్రమానికి తీసుకుపోయాడు. అక్కడ మునులకు కలిగే విఘ్నాలను తొలగించటానికి కువలయాశ్వుడు (ఋతధ్వజుడు) ఉద్యుక్తుడయ్యాడు.

**పాతాళానికి పయనం :**

ఇంతలో దానవుడు పందిరూపంతో అక్కడికి వచ్చాడు. ముని శిష్యులు "రాక్షసుడు, రాక్షసుడు" అని బిగ్గరగా అరిచారు. ఋతధ్వజుడు అశ్వాన్ని అధిష్ఠించి రాక్షసుణ్ణి తరుముకుంటూ పోయి అర్ధచంద్రశరంతో

కొట్టాడు. దెబ్బతిని వారు మహారణ్యం దాటి పరిపరిగా పారిపోయారు. రాకుమారుడు రక్కసుల్ని వెన్నంటాడు. పెక్కు యోజనాలు అలా పారిపోయి వారు చివరికి ఒక భూవివరంలో ప్రవేశించారు. వాళ్ళ వెన్నాడుతూ ఋతధ్వజుడు గాఢాంధకారమయమైన ఆబిలంలో అశ్వంతో సహా ప్రవేశించాడు.

కాని అక్కడ అతనికి వరాహం కనిపించలేదు. కొంత దూరం పోయేసరికి మహాతేజస్సుతో ప్రకాశించే పాతాళలోకం అతని కంటబడింది. అమరావతిలాగా అందమైన ఒక నగరం కూడా గోచరించింది. కాని విచిత్రమేమంటే ఆ పట్టణంలో జనసంచారం లేదు.

అక్కడ రాకుమారుడు అటూ ఇటూ తిరిగాడు. చివరికి త్వరితగతితో ఎక్కడికో పోతున్న ఒక స్త్రీ అతడికి కనిపించింది. "నీ వెవరు? ఎక్కడికి పోతున్నావు?" అని అతడామెను అడిగాడు. కాని ఆమె బదులు చెప్పకుండా ఒక మేడ మెట్లెక్కి చకచకా పైకిపోయింది. అతడు గుర్రాన్ని అక్కడే విడిచి ఆమెను అనుసరిస్తూ వెళ్ళాడు.

## ఎవరీ మోహనాంగి?

అది ఒక విశాలమైన భవనం. అక్కడ మంచంపై కూర్చున్న ఒక కన్యకను ఋతధ్వజుడు చూశాడు. చంద్రునివంటి ముఖమూ, నల్లకలువల వంటి కనులూ, దొండపండు లాంటి పెదవీ, ఎత్తైన ముక్కూ, ఉన్నతమైన

కుచాలూ, నల్లని మృదువైన కచాలూ కల ఆ యువతి రతీదేవిలా వున్నది. "ఆమె పాతాళలోకానికి అధిదేవత కాబోలు" అని అనుకొన్నాడతడు.

మహాసౌందర్యవంతుడై మంచిలక్షణాలు కలిగివున్న ఋతధ్వజుణ్ణి చూచి ఆ కన్యక అతడు మన్మథుడు కాబోలు అనుకొన్నది. వెంటనే ఆమె సిగ్గుపడి మంచంమీంచి దిగి నిల్చొని చిత్తక్షోభం పొందింది. "అతడు దేవతో, యక్షుడో, గంధర్వుడో, విద్యాధరుడో, ఎవడో" అనుకుంటూ నిట్టూర్చి చివరికి సొమ్మసిల్లి నేలపై వ్రాలిపోయింది.

రాజపుత్రుడు ఆమెను చూచి కామశరపీడితుడయ్యాడు. ఐనా ధైర్యంతో "భయపడకు, భయపడకు" అంటూ ఆమెను ఓదార్చాడు.

పూర్వం మెట్లెక్కుతూ అతడికి కనిపించిన స్త్రీ ఆమెకు వీవనతో విసురుతూ పరిచర్య చేసింది. ఎట్టకేలకు ఆ కన్య మూర్ఛనుండి తేరుకొన్నది. "మూర్ఛకు కారణం ఏమిటి?" అని అడిగాడతడు. ఆమె సిగ్గుతో చెప్పలేక చెలికత్తెకు తన మనోగతాన్ని తెలియపరచింది.

**మదాలస ఈమే:**

ఆ చెలికత్తె ఆమె వృత్తాంతాన్ని ఋతధ్వజునికి ఇలా తెలియపరచింది:—

"అయ్యా! ఈమె విశ్వావసువనే గంధర్వుని కుమార్తె. ఈమె పేరు మదాలస. నేనీమెకు చెలికత్తెను. నా పేరు కుండలి. నా భర్త శుంభుడనే రాక్షసుని చేతిలో మరణించాడు. నాటినుండీ నేను పరిక్షతో తీర్థాటనం చేస్తున్నాను.

వజ్రకేతుడి పుత్రుడు పాతాళకేతువనే రాక్షసుడు ఈమెను ఉద్యానవనంలోంచి అపహరించి తెచ్చి ఇక్కడ ఉంచాడు. రాబోయే త్రయోదశినాడు ఈమెను వివాహమాడాలని నిశ్చయించుకొన్నాడు.

అందువల్ల ఈమె నిన్న ఆత్మహత్య చేసుకోవాలని నిశ్చయించుకొన్నది. ఇంతలో కామధేనువు, రాక్షసుడు ఈమెను పెండ్లాడలేడనీ, వాణ్ణి బాణప్రయోగంతో భేదించగల ఒక మహానుభావుడు ఈమెకు భర్త కాగలడనీ, తెలిపి ఈమెను ఓదార్చింది. దుర్మార్గుడైన పాతాళకేతువు వరాహరూపంతో తిరుగుతుండగా ఎవరో బాణంతో కొట్టారని ఇప్పుడే తెలియవస్తున్నది.

మన్మథునిలా మనోహరుడవైన నిన్ను చూడగానే ఈమెకు నీపై మోహం కలిగింది. కాని దానవుణ్ణి కొట్టినవాడే ఈమెకు భర్త కానున్నాడని కామధేనువు చెప్పింది కదా! ఒకరిపై ప్రేమా, మరొకరికి భార్య కావలసిన దుర్గతి కలిగిందన్న చింతతోనే ఈమె మూర్ఛిల్లింది. ఇక జీవితాంతం ఈమె ఇలా దుఃఖం అనుభవించక తప్పదు. ఈమెపై నాకెంతో ప్రీతి. అందువల్ల నేను కూడా విచారానికి గురి అవుతున్నాను.

**నేను మానవుణ్ణే:**

ఇంతకూ మహానుభావా! మీరెవరో? ఇక్కడికెలా వచ్చారో? ఎందుకు వచ్చారో? సామాన్య మానవులు ఇక్కడికి రాలేరు. మీ వృత్తాంతం తెలిపి మా సందేహం తీర్చండి!"

తర్వాత ఋతధ్వజుడిలా అన్నాడు—"ఓ ధర్మజ్ఞురాలా! నేను శత్రుజిత్తుని పుత్రుణ్ణి. నన్ను ఋతధ్వజుడంటారు మా తండ్రి పంపగా నేను సాధుసంరక్షణకై గాలవమహర్షి ఆశ్రమానికి వచ్చాను. అక్కడి మునులకు వ్రతభంగం కలిగిస్తూ వరాహరూపంతో ఒక దుష్టుడు వచ్చాడు. వాణ్ణి తరుముకొంటూ వచ్చి అర్ధచంద్రబాణంతో కొట్టాను. వాడు మహా వేగంతో పరుగుదీశాడు. వాణ్ణి వెంబడిస్తూ నేనూ వచ్చాను. వాడు ఒక చీకటిబిలంలో ప్రవేశించాడు. నేనూ అందులో దూకాను.

ఆ తర్వాత వాడు నాకు కనిపించలేదు. కొంతసేపటికి ఒక వెలుగు కనిపించింది. నిన్ను చూచాను. నేను పలకరించినా నీవు నాతో పలకలేదు. నిన్ను అనుసరిస్తూ ఈ మేడమీదికి చేరుకొన్నాను. ఇది నా వృత్తాంతం. నన్ను గూర్చి మీరు సందేహపడకండి! నేను మానవుణ్ణే. ఇది ముమ్మాటికీ నిజం.

**మదాలస పెళ్లైంది:**

ఇది విన్న మదాలస సిగ్గుతో ఏమీ చెప్పలేక చెలికత్తె మొగం చూస్తూ

పొంగిపోయింది. కామధేనువు పలుకులు గుర్తుకుదెచ్చి కుండలి ఆమెను సంతోషపరచింది. మదాలసను వివాహమాడవలసిందిగా ఋతధ్వజుణ్ణి అభ్యర్థించింది. అతడు సమ్మతించాడు.

మదాలస తన కులగురువైన తుంబురుణ్ణి స్మరించింది. ఆ మహర్షి సమిధలూ, దర్భలూ చేతబట్టుకొని ప్రత్యక్షమయ్యారు. మంత్రవేత్త అయిన ఆ మునీంద్రుడు శాస్త్రవిధిని అనుసరించి అగ్నిసాక్షికంగా మదాలసా ఋతధ్వజులకు వివాహం చేశారు. తర్వాత ఆయన తన ఆశ్రమానికి వెళ్లారు.

కుండలి సతీపతులకు దాంపత్య ధర్మాలు బోధించింది. ఆపై వాళ్ల అనుమతితో తపస్సు చేయాలని ఎక్కడికో వెళ్లింది. ఋతధ్వజుడు భార్యతో సహా అశ్వాన్ని అధిష్ఠించి పాతాళలోకంనుండి భూలోకానికి బయలుదేరి పోయారు.

విజయలక్ష్మి వరించింది:

ఇంతలో జరిగిన వృత్తాంతం తెలుసుకొన్న దానవులు తండోప తండాలుగా వచ్చి తీక్ష్ణమైన ఆయుధాలతో ఋతధ్వజుణ్ణి ఎదుర్కొన్నారు. పూర్వం దెబ్బతిని పారిపోయిన పాతాళకేతువే సైన్యంతో వచ్చి మళ్లీ అతనితో తలపడ్డాడు. పోరు ఘోరంగా జరిగింది. రాజకుమారుడు

దివ్యాస్త్రాలు ప్రయోగించి పాతాళకేతువుతో సహా శత్రుసేనల నన్నింటిని చీల్చి చెండాడారు. కపిలుని కోపాగ్నిలో సగరపుత్రులలాగా రాజపుత్రుని శస్త్రాగ్నిలో పడి రాక్షసులు దగ్ధమైపోయారు.

మదాలసతోపాటు యుద్ధంలో విజయలక్ష్మిని గూడా వరించి ఋత ధ్వజుడు తన పట్టణానికి తిరిగివచ్చి తండ్రికి నమస్కరించారు. జరిగిన దంతా ఆయనకు పూసగుచ్చినట్లు నివేదించారు. అతని సాహసానికి, ధైర్య స్థైర్యాలకూ తండ్రి ఎంతో సంతోషించారు. మదాలస అత్తమామలకు నమస్కరించింది. వాళ్ళు మనసారా ఆమెను ఆశీర్వదించారు. నూతన దంపతులు దిన దిన ప్రవర్ధమానమైన అన్యోన్యానురాగంతో కాలం గడుప సాగారు.

శత్రుజిత్తు ఒకనాడు కుమారుణ్ణి పిలిచి భూరక్షణార్థమై అప్పుడప్పుడూ భూసంచారం చేయడం రాజధర్మమని చెప్పారు. తండ్రిమాట శిరసావహి అతడు భూవలయం సంచరిస్తూ దుష్టశిక్షణా, శిష్టరక్షణా చేశారు. కొంతకాలం జరిగింది.

**తాళకేతువు - కపటనాటకం :**

ఒకరోజు యమునాతీరంలో సంచరిస్తున్న ఋతధ్వజుణ్ణి పాతాళ కేతుని సోదరుడైన తాళకేతువు చూశాడు. వాడు ఒక మాయా

రాజకుమారుణ్ణి చూడగానే వారికి పూర్వవైరం గుర్తుకు వచ్చింది. ఎలాగైనా వాడు పగ తీర్చుకోవాలనుకున్నారు.

వెంటనే మునివేషంలో అతణ్ణి సమీపించి "రాజకుమారా! నీవు సత్యాత్ముడివి. మహాత్యాగివి. నా కోరిక నెరవేరుస్తావన్న ఆశతో నిన్ను ఆశ్రయించాము. మేము యజ్ఞం చేయాలనే తలంపుతో వున్నాము. కాని దక్షిణ లివ్వడానికి నావద్ద ధనం లేదు. నీకంఠాభరణం నాకు సమర్పించి పుణ్యం కట్టుకో. ఇప్పుడే ఈ నదిలో దూకి జలగర్భంలో వున్న వరుణదేవుణ్ణి సమంత్రకంగా ఆరాధించి ఆయన అనుగ్రహం సంపాదించి తిరిగి వస్తాను" అని ప్రార్థించాడు

ఆ మాటలు నమ్మి నమస్కారం చేసి రాజకుమారుడు తన కంఠాభరణం అతనికి సమర్పించాడు. అతడు తిరిగి వచ్చేవరకూ అతని ఆశ్రమానికి ఏ విధమైన బాధా కలగకుండా రక్షిస్తూ వుంటానని కూడా మాటా యిచ్చాడు.

వెంటనే ఆ కపటముని నదీజలంలో మునిగాడు. కొంతదూరం నీళ్లల్లోనే పోయి ఋతధ్వజుని కంటబడకుండా వెలికి వచ్చి సరాసరి అతని పట్టణానికి వెళ్లాడు. అక్కడ మదాలస మొదలైన అంతఃపుర స్త్రీల ముందు నిలిచి - ఋతధ్వజుడు తన ఆశ్రమసమీపంలో తపస్వులను రక్షిస్తూ వున్నాడని. హఠాత్తుగా ఒక దుష్టరాక్షసుడితో యుద్ధానికి

తలపడ్డారనీ, ఆ మాయావి దానవుడు శూలంతో అతని వక్షఃస్థలంపై కొట్టారనీ, ఆ దెబ్బకు మరణిస్తూ రాకుమారుడు కంఠాభరణం తనకు అందజేశారనీ, శోకార్తులైన తాపసులు అతనికి అగ్నిసంస్కారం కూడా పూర్తిచేశారనీ, ఋతధ్వజుని గుఱ్ఱాన్ని కూడా ఆ దానవుడు అపహరించాడనీ, ఇది తాను కళ్ళారా చూచాననీ వలవల ఏడుస్తూ చెప్పాడు ఉత్తరకాలక్రియలు చేయటానికి వాళ్ళను ప్రోత్సహిస్తూ కంఠాభరణం వాళ్ళముందుంచి వచ్చినట్టే తోవనే మరలిపోయాడు.

## మదాలస చనిపోయింది :

అతని మాటలు వింటూనే అంతఃపురకాంతలందరూ మూర్ఛపోయారు. శత్రుజిత్తు ఎంతో దుఃఖించాడు. కంఠాభరణం చూచి తన భర్త నిజంగా మరణించాడని నమ్మి మదాలస అప్పటికప్పుడే ప్రాణం వదలింది. నగరమంతా శోకాకులమైపోయింది.

రాజు కొంతసేపటికి దుఃఖాన్నుంచి తేరుకున్నాడు. శిష్టరక్షణకై ప్రాణాలు త్యజించిన కొడుకును శ్లాఘించాడు. భర్త మరణవార్త వింటూనే ప్రాణాలు వీడిన మహాపతివ్రత మదాలసను జంటూ పౌరులందరూ ఆమెను కీర్తించారు. శత్రుజిత్తు కోడలికి అగ్నిసంస్కారం చేయించి కుమారుడికి ఉత్తరక్రియలు జరిపాడు.

తాళకేతువు మళ్ళీ యమునానదికి వెళ్లాడు. వీళ్లతో కొంతదూరం ప్రయాణం సాగించి ఆశ్రమసమీపంలో వెలికి వచ్చారు. "రాజకుమారా! నీ వల్ల నేను కృతార్థుణ్ణయ్యాను. నా కోరిక నెరవేరింది. యజ్ఞం పూర్తిచేశాను. వరుణుడి అనుగ్రహానికి పాత్రుణ్ణయ్యాను. సర్వదా నీకు కృతజ్ఞుణ్ణి" అంటూ ఋతధ్వజుణ్ణి శ్లాఘించాడు.

## ధర్మరక్షకే కర్తవ్యం:

రాజపుత్రుడు అతడికి నమస్కరించి అశ్వాన్ని అధిష్ఠించి తన పట్టణానికి వెళ్లాడు. తల్లి దండ్రులకు నమస్కరించాలనీ, మదాలసను చూడాలనీ కౌతుకంతో నగరప్రవేశం చేశాడు. కళావిహీనమైన పట్టణాన్ని చూడగానే అతనికి ఆశ్చర్యంతోపాటు విచారం కలిగింది. ప్రజలు కూడా అతణ్ణి చూచి ఆశ్చర్యపడ్డారు.

అతడు నేరుగా తండ్రి యింటికి వెళ్లాడు. ఆశ్చర్యానందాలతో ఉక్కిరిబిక్కిరై తల్లిదండ్రులు అతణ్ణి కౌగలించుకున్నారు. "ఇక్కడ ఏమి జరిగింది?" అని అతడు ప్రశ్నించాడు. జరిగిన వృత్తాంతం తండ్రి వివరించాడు.

మదాలస మరణించిందని వింటూనే ఋతధ్వజుడు విభ్రాంతి చెందాడు. తనకోసం ఆమె అసువులు వీడిందని చాలా చింతా

క్రాంతుడయ్యాడు. ఆమె ఇక లేదని విని కూడా తాను మరణించనందుకు తమ్ము తానే నిందించు కొన్నారు. తన జీవితం ఇక వ్యర్థం అనుకొన్నారు

తుదకు మనసు చిక్కబట్టుకొని తాను కూడా మరణించడంవల్ల ప్రయోజనం ఉండదనీ, ఊరక ఏడవటంవల్ల కూడా లాభం లేదనీ, అందువల్ల పది మందిలో తాను పలుచబడి పోతాననీ నిశ్చయించుకొన్నారు. తండ్రి ఆనతి పరిపాలిస్తూ ధర్మరక్షణ చేయటమే తన కర్తవ్యమన్న నిర్ణయానికి వచ్చారు.

ఐతే మదాలసపట్ల కృతజ్ఞతగా తాను మరొక స్త్రీని చేపట్టకూడదని ప్రతిన పూనారు. తన కొఱకై జీవితాన్నే త్యజించిన వనిత పట్ల తాను అంత స్వల్పత్యాగమైనా చెయ్యకపోతే కృతఘ్నుడ నవుతానని భావించారు.

ఇలా నిర్ణయించుకొని భార్యకు తర్పణమిచ్చి యథావిధిగా ఉత్తరకా క్రియలు పూర్తిచేశారు. సమస్తభోగాలనూ వదలుకొన్నారు. నాటినుండి సమ వయస్కులైన రాకుమారులతో కలిసి విహరిస్తూ కాలం గడుపుతున్నారు.”

ఈ విధంగా ఋతధ్వజుడి వృత్తాంతం తండ్రికి తెలియజేసి నాగ కుమారులు మళ్లీ ఇలా అన్నారు —

“నాన్నా! ఋతధ్వజుణ్ణి సంతోషపెట్టడానికి చేయవలసిన కార్యం ఒక్కటే. మళ్లీ ఎలాగైనా మదాలసను బ్రతికించాలి. అది అసాధ్యం. దేవతలకు కూడా సాధ్యం కాని పని. ఇక ఇతరులెలా చేస్తారు?”

నాగరాజు కొడుకుల మాటవిని ఆలోచనా నిమగ్నులయ్యారు. కొంత సేపటికి చిరునవ్వు నవ్వుతూ ఇలా అన్నారు–

“అబ్బాయిలూ! ఒక పని సాధ్యంకాదని ప్రయత్నం విరమించ కూడదు. పురుషప్రయత్నంలో లోటు వుండరాదు. ఆ పిమ్మట దైవం అనుకూలిస్తే ఫలం సిద్ధిస్తుంది. నేను తపశ్చర్య అవలంబించి ఈ పని సాధించటానికి ప్రయత్నిస్తాను”

## అశ్వతరుని తపస్సు:

ఆ మరునాడే అశ్వతరుడు హిమాలయానికి వెళ్లాడు. అక్కడ ప్లక్షావతరణమనే తీర్థంలో తీవ్రతపస్సు ప్రారంభించాడు. నియతాహారంతో త్రిసంధ్యలలో స్నానం చేస్తూ సరస్వతీదేవిని పలువిధాల ప్రార్థించాడు. అనేక మంత్రాలతో ఆ దేవిని ఉపాసించాడు. ఆమె మహిమను పెక్కు విధాల కొనియాడాడు.

తుదకు సరస్వతి అతనికి సాక్షాత్కరించింది. అతడు కోరినట్లే సప్తస్వరాలూ, రాగాలూ, గీతాలూ, కీర్తనలూ మొదలైన వాటిలో అతనికి ప్రావీణ్యం కలిగేటట్లు అనుగ్రహించింది. అతని సోదరుడైన కంబలుడికి గూడా అతనికి సహాయపడమని చెప్పి అంతర్ధానమయింది.

ఆ పిమ్మట కంబలుడూ, అశ్వతరుడూ ఇరువురూ కలిసి కైలాసవాసి అయిన పరమశివుణ్ణి తంత్రీలయస్వరాలతో కూడిన గీతాలు ఆలపిస్తూ భక్తితో ఆరాధించారు. బహుకాలం సాగినవాళ్ళ ఆరాధనకు మెచ్చి మహేశ్వరుడు ప్రత్యక్షమై ఏమి వరం కావాలో కోరుకొమ్మన్నారు.

అశ్వతరుడు పరమేశ్వరుడికి సాష్టాంగ నమస్కారం చేసి "దేవదేవా! త్రిలోచనా! మాపై నీకు అనుగ్రహం కల్గితే మేము కోరేవరం అనుగ్రహించు. ఋతధ్వజుని పత్ని మదాలస మరణించినప్పటి వయసుతో పూర్వరూపంతో నాకిప్పుడు కుమార్తె అయ్యేటట్లు వరం ప్రసాదించు. ఆమెకు పూర్వస్మృతి ఉండేటట్లు, ఆమె మహాయోగినిగా, యోగిమాతగా అయ్యేటట్లు గూడా అనుగ్రహించు మహాప్రభో!" అని ప్రార్థించారు. శివుడు అతని కోరికను అనుగ్రహించి అంతర్ధానమయ్యాడు.

## మదాలస మళ్ళా పుట్టింది :

ఆ మహాదేవుని ఆనతిప్రకారం నాగలోకానికి వెళ్ళి అశ్వతరుడు పితృతర్పణం చేసి మధ్యమపిండం భుజించాడు. వెంటనే మదాలస పూర్వ రూపంతో అతని మధ్యమఫణం నుండి నిట్టూర్పుద్వారా ఉద్భవించింది. అశ్వతరుడు ఆమెను అంతఃపురంలో రహస్యంగా వుంచి దాసీజనంతో ఆమెకు సకలపరిచర్యలూ చేయించాడు.

ఋతధ్వజుడు నాగలోకానికి వచ్చాడు :

నాగకుమారులిరువురూ యథాప్రకారం భూలోకానికి వెళ్ళి ఋతధ్వజునితో క్రీడిస్తూ వుండేవారు. ఒకనాడు వాళ్ళ తండ్రి ఋతధ్వజుణ్ణి తన వద్దకు తీసుకురమ్మని వాళ్ళతో చెప్పాడు. వాళ్ళు మరునాడు తమలోకానికి రమ్మని అతణ్ణి ప్రార్థించారు. అతడు మొదట అంగీకరించలేదు. "మా తండ్రి గారి అనతిపై మేము నిన్ను పిలుస్తున్నాము. ఆయన నిన్ను చూడాలని ఎంతో ఆశతో ఉన్నారు" అని వాళ్ళు మళ్ళీ ప్రార్థించారు. అందుకు అతడు సమ్మతించాడు. నాగకుమారులతో బయలుదేరి నాగలోకం చేరుకొన్నారు.

అన్నివిధాల అందమైన ఆ లోకం అతణ్ణి ఆకర్షించింది. క్రీడించే నాగకన్యలతో, వేణు వీణాగానాలతో, వివిధవాద్యనాదాలతో, నిండిన అందలి మేడలు చూడ చక్కగా ఉన్నాయి.

వాళ్ళు ముగ్గురూ నాగరాజ భవనం ప్రవేశించారు. అక్కడ దివ్య మాల్యాలు, దివ్యాంబరాలు ధరించి మణిహారాలతో ప్రకాశిస్తూ రత్నాలు తాపిన బంగారుసింహాసనంపై కూర్చొని వున్న నాగరాజును రాజకుమారుడు చూశాడు. ఆయన పాదాలకు నమ్రశిరస్కుడై నమస్కరించాడు.

నాగరాజు ఋతధ్వజుణ్ణి గాఢంగా కౌగలించుకొని "చిరంజీవ!" అని మనసారా ఆశీర్వదించాడు. అతని సద్గుణాలను కొనియాడాడు. అతనికి

కావలసిన ఉపచారాలన్నీ చేయవలసిందని పుత్రులను హెచ్చరించారు. పిమ్మట ఆ మాటా, ఈ మాటా చెప్పుకుంటూ కొంతసేపు గడిపి అందరూ మధురపదార్థాలతో కూడిన విందు భుజించటానికి ఉపక్రమించారు.

## ఏమిటి నీ అభీష్టం?

భోజనానంతరం అందరూ ఒకచోట సమావేశమైనారు. కాలోచితమైన సంభాషణలతో అశ్వతరుడు రాజపుత్రుడికి ఆహ్లాదం కల్గిస్తూ ఇలా అన్నారు:

"నాయనా! మాయింటికి నీవు అతిధిగా రావటం సంతోషకరం. తండ్రివద్ద కొడుకులాగా నావద్ద దాపరికం లేకుండా ఏం కావాలో చెప్పు. ధన కనక వస్తు వాహనాదులలో నీకు అభీష్టమైనది కోరుకో!"

ఋతధ్వజుడు వినయంతో ఇలా బదులు పలికాడు. "ఆర్యా! తమ అనుగ్రహంవల్ల మాయింట సమస్తవస్తువులూ వున్నాయి. నాకిక ఏ వస్తువుతోనూ పనిలేదు. మాతండ్రి సహస్రాయువై సువిశాల సామ్రాజ్యాన్ని పరిపాలిస్తున్నాడు. ఇక నాకు కావలసింది ఏమున్నది? తండ్రి జీవించి వుండడమే మహాభాగ్యం అంతకంటే కోరదగినది ఏమీ లేదు. తండ్రిగారి బాహువనే చెట్టునీడక్రింద వున్నవానికి ఇది వున్నది, అది లేదు అని చింత వుండదు. మీ పాదపద్మాలను స్పృశించడంతో నాకు అన్ని అభీష్టాలూ నెరవేరినట్లే".

అతని మాటలకు అశ్వతరుడు మనస్సులో ఎంతో సంతోషించాడు. ఎలాగైనా అతనికి ఉపకరించాలన్న అభిప్రాయంతో మళ్ళీ ఇలా చెప్పారు:

"రాజకుమారా! ధనకనకాదులు నీకు అవసరం లేకపోతే పోనీ. నీ మనస్సుకు ప్రీతికలిగించే మరే వస్తువైనా కోరుకో!"

అందుకు ఋతధ్వజుడు ఒక్కక్షణం మౌనంతో వుండి "ఓ పన్నగేంద్ర!" నాకు ఏదో ఒక వరం ఇచ్చి తీరాలన్నది మీ పట్టుదల అయితే నా హృదయంనుండి పుణ్యసంస్కారం ఎప్పుడూ తొలగకుండా వుండేటట్లు అనుగ్రహించండి! పుణ్యముంటే ఇతర భోగాలన్నీ తమంతట తామే వస్తాయి. పుణ్యాత్ములకు దుర్లభమైనది ఏదీ లేదు" అని అన్నాడు.

ఎలాగైనా మదాలసను చూడాలి:

అప్పుడు అశ్వతరుడు "కుమారా! నీలో సదా ధర్మబుద్ధి వికసించుగాక! పుణ్యం వృద్ధిచెందు గాక! అయినా మా యింటికి నీవు వచ్చావు. కాబట్టి భూలోకంలో నీకు దొరకని వస్తువు ఏదైనా ఒకటి కోరుకో!" అని మళ్లీ నిర్బంధించాడు.

రాజకుమారుడు ఇక ఏమీ చెప్పలేక నాగకుమారులవైపు చూచాడు. వాళ్లు తండ్రికి నమస్కరించి రాజపుత్రుడి అభీష్టాన్ని స్పష్టంగా వివరించి "తండ్రీ! ఇతడు మదాలసామరణానంతరం మరొక స్త్రీని వివాహమాడనని ప్రతిజ్ఞ చేశాడు. మదాలసను ఎలాగైనా మళ్లీ చూడాలన్నదే ఇతనికి కోరిక. అది సాధ్యపడితే అంతకంటే ఇతనికి మనం చేయవలసిన ఉపకారం మరొకటి లేదు" అని మనవి చేశారు.

అప్పుడు నాగరాజు గతించిన వారితో కలయిక అసంభవమనీ, స్వప్నంలో గానీ లేదా శాంబరీమాయతో గానీ మరణించిన వారిని చూడాలే తప్ప వేరుమార్గం లేదనీ పలికారు.

సిగ్గుపడుతూ రాజకుమారుడు "మాయారూపంలో ఐనా మదాలసను చూపిస్తే అదే నాపట్ల గొప్ప అనుగ్రహం" అని అన్నారు.

మదాలసతో భూలోకానికి :

"మాయామయమైన మదాలసను చూడదలిస్తే చూడు. అతిథివి కాబట్టి నిన్ను సంతోషపెట్టడం మా ధర్మం" అనిచెప్పి అశ్వతరుడు రహస్యంగా వుంచిన మదాలసను రప్పించి అతనికి చూపి "రాజపుత్రా! ఈమె నీ భార్య మదాలసేనా? అని ప్రశ్నించారు. ఆమెను చూడగానే సిగ్గు వీడి ఋతధ్వజుడు "హా ప్రియా!" అంటూ ఆమెకు ఎదురుగా వెళ్లారు

అశ్వతరుడు అతణ్ణి నివారిస్తూ "కుమారా! ఇది మాయ అని ముందే చెప్పాను. ఆమెను తాకవద్దు. తాకితే మాయమైపోతుంది సుమా!" అని హెచ్చరించారు.

అప్పుడు ఋతధ్వజుడు "హా! ప్రియా" అంటూ సొమ్మసిల్లి నేలపై

పడిపోయారు. మళ్లీ కొంతసేపటికి తేరుకొని తన దురవస్థను విచారిస్తూ వుండిపోయారు.

తర్వాత నాగరాజు అతణ్ణి ఓదార్చి మదాలస మళ్లీ బ్రతికిన వృత్తాంతం విపులంగా వివరించారు. అది విన్న ఋతధ్వజుని ఆనందానికి అవధి లేకపోయింది. అతడు కృతజ్ఞతతో నాగరాజుకు నమస్కరించి "మీ ఋణం ఎన్ని జన్మలకైనా తీర్చుకోలేను" అని అన్నారు.

ఆపై ఆయన అనుమతి తీసుకొని మదాలసతోసహా అశ్వాన్ని అధిరోహించి తన నగరానికి వెళ్లారు. మదాలసను చూసి శత్రుజిత్తూ, ఆయన అనుచరులూ ఆశ్చర్యచకితులయ్యారు.

మరణించిన మదాలస మళ్లీ జీవించిన వృత్తాంతం రాకుమారుడు సవిస్తరంగా తండ్రికి చెప్పారు. ఆమె అత్తమామలకు నమస్కరించి తక్కిన వాళ్లను యథోచితంగా సంభావించింది. ఈ సువార్త విన్న పురజనులు సంబరపడి మహోత్సవం జరుపుకొన్నారు. ఋతధ్వజుడు మదాలసతో బహుకాలం రమ్యమైన ప్రదేశాలలో విహరిస్తూ సుఖంగా కాలం గడిపారు.

ఆపై కొంతకాలానికి శత్రుజిత్తు కాలధర్మం చెందారు. పౌరులు ఋతధ్వజుణ్ణి రాజుగా అభిషేకించారు. అతడు చక్కగా రాజ్యపరిపాలన కొనసాగించి పౌరులకు ప్రీతిపాత్రుడైనారు.

## పుత్రజననం - ఆత్మతత్త్వ ప్రబోధం :

తర్వాత కొంత కాలానికి మదాలస గర్భం ధరించి శుభలగ్నంలో పుత్రుణ్ణి ప్రసవించింది. ఋతధ్వజుడు వాడికి 'విక్రాంతుడు' అని పేరు పెట్టాడు.

ఆ పేరు విని రాజసేవకులూ, అంతఃపురవాసులూ అందరూ సంతోషించారు. కాని మదాలసమాత్రం ఒక నవ్వు నవ్వింది. ఆమె ఏడుస్తున్న బాలకుణ్ణి ఊయలలో పండబెట్టి ఓదార్చే నెపంతో ఈక్రింది అర్థం వచ్చేటట్లు జోలపాట పాడింది.

"నాయనా! నీవు శుద్ధుడివి, బుద్ధుడివి, నిరంజనుడివి, నిర్వికారుడివి, నీకు పేరు లేదు. ఈపేరు కల్పితం మాత్రమే. ఈ పంచభూతాత్మకమైన శరీరం నీవు కాదు. దీనికీ, నీకూ ఎలాంటి సంబంధమూ లేదు. నీవు సంసారమాయకు అతీతుడివి. ఇక ఎందుకలా ఏడుస్తున్నావు?

"పరిశుద్ధ స్వరూపుడనైన నేను ఈప్రాకృత ప్రపంచంలోకి వచ్చానే" అని ఏడుస్తున్నావా? ఈప్రకృతిలోని భౌతికపదార్థాలతో నీకు ఏమాత్రం సంబంధంలేదు. ఇక నీకు ఏడుపెందుకు?

భౌతికదేహం భౌతిక పదార్థాలతోనే వృద్ధిపొందుతుంది. భౌతికం

గానే నశిస్తుంది. దేహాతీతుడవైన నీకు హానివృద్ధులు లేవు. ఈ శరీరం తొడుక్కున్న చొక్కాలాంటిది. ఇది నశించినా నీవు విచారించవలసిన పనిలేదు.

శుభాశుభకర్మలనే మూఢులు ఈదేహాన్ని నీకు కట్టబెట్టారు. "తండ్రి" అని కొంతసేపు, 'తనయా' అని కొంతసేపు, 'తల్లి' అని కొంతసేపు; 'భార్యా' అని కొంతసేపు, 'నాది' అని కొంతసేపు 'నాది కాదు' అని కొంతసేపు - ఇలా భౌతికవస్తుసంచయాన్ని గూర్చి ఎందుకు ప్రలపిస్తావు?

మూఢులు దుఃఖాలను సుఖాలనుకుంటున్నారు. జ్ఞానులు సుఖాలనే దుఃఖాలని భావిస్తున్నారు.

రక్తం, మాంసం, అస్థిపంజరం మొదలైన పదార్థాలతో కూడుకొన్న ఈ శరీరంపై అపేక్ష ఎందుకు? నేలపై వాహనమూ, వాహనంపై దేహమూ, దేహములో పురుషుడూ ఉన్నారు. నేలమీద అభిమానం లేనప్పుడు దేహం మీద అభిమాన మెందుకు?

ధర్మాధర్మాలనూ సత్యాసత్యాలనూ విడిచిపెట్టు. దేనితో వాటిని వదులుతావో దానిని కూడా వదలిపెట్టు''

ఈ విధంగా ప్రతిదినమూ ఆత్మతత్త్వాన్ని బోధించే పాటలు పాడుతూ మదాలస కొడుకును పెంచి పెద్ద చేసింది. వాడు క్రమంగా తల్లి

ఉపదేశం విని శరీరంతోపాటు ఆత్మజ్ఞానం కూడా పెంచుకున్నారు. పుట్టిన క్షణంమండే మాతృబోధవల్ల వారికి వైరాగ్యం అలవడింది. అందుచేత యుక్తవయస్కులైన తర్వాత గూడా వారికి గృహస్థాశ్రమం స్వీకరించాలనే బుద్ధి పుట్టలేదు.

మదాలసకు రెండవ పుత్రుడు పుట్టాడు. తండ్రి అతనికి 'సుబాహుడు' అని పేరు పెట్టారు. ఆ పేరు విని మదాలస మళ్లీ నవ్వింది. వాణ్ణికూడా ఊయలలో పండబెట్టి తత్త్వోపదేశం చేసింది. వాడూ అన్నలాగా ఆత్మజ్ఞాని ఐపోయాడు.

మదాలసకు పుట్టిన మూడవ కుమారుడికి రాజు 'అరిమర్దనుడు' అని పేరు పెట్టాడు. అదివిని ఆమె మిక్కిలిగా నవ్వుకొన్నది. మాతృబోధవల్ల వాడుకూడా ఆత్మతత్త్వం ఒంటబట్టించుకొన్నాడు. సంసారసుఖాలను అపేక్షించకుండా నిష్కామ కర్మలు చేయసాగాడు.

నీవే పేరు పెట్టు :

కాలక్రమంలో మదాలసకు నాల్గవ కుమారుడు పుట్టాడు. రాజు వానికి పేరు పెట్టబోతూ చిరునవ్వు లొలికిస్తున్న మదాలసవైపు చూచాడు. "నేను పేరు పెట్టినప్పుడల్లా నీవు నవ్వడానికి కారణమేమో చెప్పు. "విక్రాంతుడు. సుబాహుడు, అరిమర్దనుడు" అన్న పేర్లు శుభప్రదాలు. ఇవి క్షత్రియులకు తగిన నీకు నచ్చకపోతే నాల్గవవాడికి నీవే పేరు పెట్టుకో!" అని అన్నాడు.

అన్నారు మదాలస నాల్గవవాడికి 'అలర్కుడు' అని పేరు పెట్టింది. వాడు ధర్మాత్ముడూ, బుద్ధిమంతుడూ అయి లోకఖ్యాతిని పొందుతాడని చెప్పింది. ఆపేరు విని రాజు అవహ్యావడి "మదాలసా! నాకుమారుడికి అసంబద్ధమైన పేరు పెట్టావు. 'అలర్క' శబ్దానికి 'వెర్రికుక్క' ని అర్థం. ఈ నీచమైన పేరు పెట్టడంలో నీ ఉద్దేశమేమిటి?" అని గారు

నిరర్థకాలే!

అందుకు మదాలస ఇట్లన్నది :—"మహారాజా! వ్యవహారం కొరకు వేము ఈ నామకరణం చేశాము నీవు పెట్టిన పేర్లు కూడా నిరర్థకాలే. ఎలాగో చెబుతా విను.

నీవు మొదటివాడికి 'విక్రాంతుడు' అని పేరు పెట్టావు. పురుషుడు (ఆత్మ) సర్వవ్యాపకుడని ప్రాజ్ఞులు చెబుతున్నారు. ఒకచోటనుండి మరొక చోటికి పోయే గమనాన్ని 'క్రాంతి' అంటారు 'విక్రాంతుడు' అంటే విశేషగమనం కలవాడు అని అర్థం. సర్వవ్యాప్తమైన ఆత్మకు రాకపోకలెక్కడివి? అసలు చలనమే లేనివానికి 'విక్రాంతుడు' అని పేరు పెట్టడం వ్యర్థమే కదా!.

రెండవవాణ్ణి 'సుబాహువు' అన్నావు. అదికూడా నిరర్థకమే. పురుషుడికి ఆకారవికారాలు లేవు. నిరాకారుడికి బాహువు లెక్కడ వుంటాయి?

మూర్ఖప వాడికి 'అరిమర్దనుడు' అని నామకరణం చేశావు. అదీ దండుగే. సర్వశరీరాలలోనూ వున్న 'ఆత్మ' ఒక్కటే. అట్టి ఆత్మకు శత్రులెవరు? మిత్రులెవరు? తనకంటే వేరైన వారొకడు వున్నప్పుడు కదా! శత్రుత్వ మిత్రత్వాలనేవి వుంటాయి. భూతాలను భూతాలు మర్దిస్తున్నాయి. ఆకారమే లేని ఆత్మకు మర్దనమన్నది లేదు కాబట్టి 'అరిమర్దనుడు' అన్న పేరు నిరర్థకం.

ఈ పేర్లన్నీ వ్యవహారం కొరకు పెట్టేవి. అన్నీ నిరర్థకాలే. ఇక 'అలర్కుడు' అన్న పేరు పెడితే మాత్రం వచ్చిన నష్టమేమి? ఆత్మజ్ఞానం లేనివారు వెర్రి పనులు చేస్తారు. వాణ్ణి 'వెర్రి కుక్క' అని పిలిచినా నష్టంలేదు".

మదాలస మాటలలోని ఔచిత్యం గ్రహించి రాజు నిరుత్తరుడయ్యాడు.

పిడివాదా........

ఆమె అలర్కుడికి కూడా తత్త్వోపదేశం ప్రారంభించింది. రాజుకు అది నచ్చలేదు. వెంటనే అతడామెతో ఇలా అన్నాడు—

"ఓ మూఢురాలా! మొదటి ముగ్గుర్నీ చేసినట్లే వీణ్ణికూడా సన్యాసిని చేస్తావా యేమి? నా వంశం విచ్ఛిన్నం కావడం నీ అభీష్టమా? నా కిష్టమైన పని చేయాలనుకుంటే నా మాట పాటించు. ఈ కడపటి వాడినైనా ప్రవృత్తిమార్గంలో ప్రవేశపెట్టు. కర్మతంతువు తెగిపోకూడదు. పితృ

దేవతలకు తర్పణాదికార్యాలు విడిచిపోకూడదు. కర్మమార్గంలో నడిపించే వారు దేవతలనూ, క్షుధార్తులనూ, పశుపక్ష్యాదులనూ అందరినీ తృప్తి పరుస్తారు. ప్రాణులన్నీ మనుష్యుడిపైననే ఆధారపడి జీవిస్తున్నాయి. ఓ మదలసా! అలర్కుణ్ణి ఐహిక-ఆముష్మికాలకు పనికి వచ్చే కర్మలలో నిపుణుణ్ణిగా చేయి."

భర్త ఆదేశానుసారం ఆమె కుమారుణ్ణి అనునయిస్తూ ఇలా బోధించింది—

మదాలస ఉపదేశం:

"కుమారా! ఆయురారోగ్యాలతో వర్ధిల్లు. ఉత్తమ కర్మలతో నీ తండ్రిని సంతోషపెట్టు. ఐహికంగానూ, ఆముష్మికంగానూ ఫలదాయక మైన కర్మయోగం చక్కగా అనుష్ఠించు. సజ్జనరక్షణకూ, దుర్జనశిక్షణకూ అవసరమైన కర్మమార్గాన్ని అవలంబించు.

నాయనా! ఈ భూవలయాన్ని ఏకచ్ఛత్రాధిపతివై పాలించనున్నావు. నీవు ధన్యుడివి. ఇంద్రసమాన వైభవాన్నీ, దేవత్వాన్నీ పొందనున్నావు. పరోపకారపరాయణుడవై జీవించు. పరస్త్రీల నుండి మనస్సును మరలించు. సదా భగవంతుని చింతించు. కామక్రోధాదులను జయించు. ధనార్జనకై రాజులను నిగ్రహించు. కీర్తికై ధనం వ్యయించు. కష్టంలో ఉన్న ప్రజలను కాపాడు.

వీరాగ్రణీ! యజ్ఞాలుచేసి దేవతలను తృప్తిపరచు. అన్నదానాది సత్కారాలతో సాధువజ్జనులనూ, ఆశ్రితులనూ సంతోషపెట్టు. బాల్యంలో బంధువులనూ, కౌమారంలో గురువులనూ, యౌవనంలో అంతఃపురకాంతలనూ, వార్ధక్యంలో వనవాసులైన మునులనూ సంతసింపజేయి. సాధుసంరక్షణార్థమై ప్రాణాలను వదలడానికి కూడా సిద్ధంగా వుండు. ఇదే పరమార్థం. కుమారా! ఈ మార్గంలో నడిచి నీ జన్మను సఫలం చేసుకో!"

తల్లి బోధలు విని అలర్కుడు బుద్ధిమంతుడై దిన దిన ప్రవర్ధమానుడయ్యాడు. అతడు బాల్యదశ దాటి కౌమారావస్థ పొందాడు. ఒకనాడు తల్లికి ప్రణమిల్లి రాజధర్మ రహస్యాలు వివరించమని ప్రార్థించాడు

## రాజధర్మ సంబోధం

తల్లి అతని కిలా బోధించింది—

"నాయనా! పట్టాభిషిక్తుడైన రాజు మొదట ప్రజలకు విరోధంలేని పద్ధతిలో ప్రవర్తించాలి. సప్త వ్యసనాలు వదలిపెట్టాలి. శత్రువులనుండి ఆత్మరక్షణ చేసుకోవాలి. మంత్రులలో దుష్టులెవరో, శిష్టులెవరో గుర్తించుకోవాలి. రాజరహస్యాన్ని జాగ్రత్తగా రక్షించుకోవాలి. తొందరపడి ఎవరినీ నమ్మకూడదు. కార్యవశాన ఒక్కొక్కసారి శత్రువులను కూడా విశ్వసించవలసి వుంటుంది. అలాంటి సందర్భాలలో ఎంతో మెలకువతో మెలగాలి.

కామక్రోధాదులకు గురికాకూడదు. సంధి విగ్రహాదులైన షడ్గుణాలను తెలుసుకొని మసలుకోవాలి. ముందు తన వారిని వశం చేసుకొని తర్వాతనే శత్రువులపై దండెత్తాలి. లేకపోతే తనవారి వల్లనే ప్రమాదం ఏర్పడవచ్చు

ఇంద్రుడు వర్షాలతో లోకాన్ని తృప్తిపరచునట్లు రాజు పరిచర్యలతో ప్రజలను తృప్తిపరచాలి. సూర్యుడు భూమినుండి జలాన్ని పీల్చుకొన్నట్లు సూక్ష్మోపాయంతో ప్రజలనుండి పన్ను రాబట్టుకోవాలి. యమధర్మరాజు లాగా భేదబుద్ధి లేకుండా అందరినీ సమానదృష్టితో శాసించాలి. స్వేచ్ఛాచారులను సరైన త్రోవకు మళ్లించే నరపాలురు సద్గతికి పోతారు. ఈ విధంగా చేస్తేనే రాజుకు ధర్మార్థకామాలలో ఏ లోపమూ వాటిల్లదు.

ఇలా తల్లి అతనికి రాజధర్మాలు బోధించింది. అలర్కుడు క్రమంగా పెరిగి యువకుడై అనుకూలమైన భార్యను చేపట్టి సంతానవంతుడయ్యాడు.

పిమ్మట కొంతకాలానికి వృద్ధుడైన ఋతధ్వజుడు అలర్కుణ్ణి పట్టాభిషిక్తుణ్ణి చేసి భార్యతోగూడా తపశ్చర్యకై అడవికి ప్రయాణమయ్యాడు.

**తుది హెచ్చరిక :**

భర్తను అనుగమిస్తూ మదాలస తుదిసారిగా కుమారుణ్ణి ఇలా హెచ్చరించింది—

"నాయనా! గృహస్థాశ్రమంలో వుండి రాజ్యపాలనం చేసే నీకు ఎన్నో కష్టాలు ప్రాప్తించవచ్చు. మమకారానికి లోబడినవారికి కష్టాలు కలగడంలో ఆశ్చర్యం లేదు. ఇదిగో, ఈ ఉంగరం నీకిస్తున్నాను. దీన్ని భద్రంగా వుంచుకో. పెద్దకష్టం కలిగినప్పుడు నీకు అవసరమనుకొంటే ఈ ఉంగరంలో సూక్ష్మాక్షరాలతో లిఖించిన శాసనం చదువుకో!"

తరువాత మదాలసాఋతధ్వజులు రాజ్యం కుమారుడికప్పగించి అడవికి వెళ్ళారు

అలర్కుడు ధర్మం తప్పకుండా ప్రజలను కన్నబిడ్డలలాగ పరిపాలించాడు. దుర్మార్గులను యథావిధిగా దండించాడు. ఎన్నో యజ్ఞాలు అనుష్ఠించాడు. ఇలా అనేక సంవత్సరాలు గడచిపోయాయి.

ఎన్ని సంవత్సరాలు రాజ్యభోగాలనుభవించినా అలర్కుడికి తృప్తి కలుగలేదు. సంసారసుఖాలపై విరక్తి ఉదయించలేదు. ఎంత ఆజ్యం పోసినా అగ్నికి దాహశాంతి కలుగదు కదా!

అలర్కుడు విషయసుఖాలకు దాసుడైపోయాడనే వార్త అడవిలోవున్న అతని అన్న సుబాహువుకు తెలిసింది. ఎలాగైనా సోదరుడికి విషయాలపై విరక్తి కలిగించి ఆత్మజ్ఞానం కలిగేటట్టు చేయాలని అతడు నిర్ణయించుకొన్నారు.

## అలర్కునిపై దండయాత్ర :

సుబాహుడు బలవంతుడైన కాశీరాజు దగ్గరకు వెళ్లి తమ్ముడు తన రాజ్యభాగం కాజేశాడని, అతణ్ణి నిగ్రహించి తన భాగం తనకిప్పించ వలసిందని ప్రార్థించాడు.

కాశీరాజు అలర్కుడిపై దండయాత్రకు సిద్ధమయ్యాడు. ముందుగా దూతను పంపి అగ్రజుడైన సుబాహుడికి రాజ్యంలో భాగం ఇవ్వవలసిందని అడిగించాడు. అన్న నేరుగా తనకడకు వచ్చి ప్రార్థిస్తే భాగమిస్తానని, పరాక్రమంతో భయపెట్టి అడిగితే స్వల్ప భూభాగం కూడా ఇవ్వనని అలర్కుడు చెప్పి పంపాడు. సోదరుణ్ణి భాగం యాచించడం రాజధర్మం కాదనుకున్నాడు సుబాహుడు. పిదప గొప్ప సైన్యంతో బయలుదేరి కాశీరాజు అలర్కుడి రాష్ట్రాన్ని ముట్టడించాడు

అతడు మాయోపాయంతో అలర్కుడి సైన్యంలో భేదం కల్పించి ఒక్కొక్క వర్గాన్ని విడివిడిగా వశం చేసుకొన్నాడు. కొందరిని సామంతోనూ. మరికొందరిని దానంతోనూ, ఇంక కొందరిని భేదంతోనూ ఇలా అలర్కుడికి విశ్వాసపాత్రులైన వారినందరినీ అతడు స్వాధీనం చేసుకొన్నాడు.

అలర్కుడి రాజ్యం దుర్బలమయింది. ధనాగారం శూన్యమయింది క్రమంగా శత్రువులు పట్టణాన్ని నలువైపులా ముట్టడించి లోపలికి చొచ్చుకు రావడానికి సిద్ధమయ్యారు

తల్లి ఇచ్చిన శాసనం :

అలర్కుడు విషణ్ణుడయ్యాడు. అతనికేమి చేయాలో తోచలేదు అడవికిపోతూ తల్లి చెప్పిన మాటలు అప్పుడతనికి గుర్తుకు వచ్చాయి వెంటనే స్నానంచేసి శుచియై పెద్దలను స్తుతించి ఉంగరంలో ఉన్న శాసనాన్ని వెలికితీసి చూచాడు. అందులో ఇలా ఉంది—

" సంగః సర్వాత్మనా త్యాజ్యః
స చేత్త్యక్తుం న శక్యతే ।
స సద్భిఃసహ కర్తవ్యః
సతాం సంగో హి భేషజమ్ ॥

కామః సర్వాత్మనా హేయః
హాతుం చేచ్ఛక్యతే న సః ।
ముముక్షాం ప్రతి తత్కార్యం
సైవ తస్యాపి భేషజమ్ ॥ "

దీని భావమిది – " అన్నివిధాలా సంగం త్యజించడం మేలు. అలా త్యజించడానికి వీలు కాకపోతే సజ్జనులతోనే సంగం పెట్టుకోవాలి. సత్సాంగత్యమే సమస్తబాధలు నివారించగల దివ్యౌషధం.

అన్నివిధాలా కోరికలను వదలాలి. అలా వదలడం సాధ్యం కాకపోతే మోక్షంపైనే ఆ కోరికను పెట్టుకోవాలి. మోక్షాసక్తే కామవ్యాధికి తగిన మందు "

వివేకోదయం :

పై వాక్యాలు పఠించగానే అలర్కుడికి జ్ఞానోదయ మయింది. అతని రోమాలు పులకించింది. కళ్లు సంతోషంతో విప్పారాయి. మాటిమాటికీ ఆ శాసనం చదువుకొన్నాడు.

'మానవుడికి మోక్షేచ్ఛ కలిగితేగానీ సుఖశాంతులు సిద్ధించవు. మోక్షేచ్ఛ సత్సాంగత్యం వలగానీ కలగదు' అన్న నగ్నసత్యం అతనికప్పుడు చక్కగా బోధపడింది.

వెంటనే అతడు పట్టణం వదలివెళ్లి దత్తాత్రేయ మునీంద్రుడికి శరణాగతుడై తన దుఃస్థితిని వివరించి తరణోపాయం చూపమనీ, దుఃఖాన్ని తొలగించమనీ ప్రాధేయపడ్డాడు.

దత్తాత్రేయుని ప్రబోధం :

అప్పుడు దత్తాత్రేయమహర్షి ఇలా అన్నాడు — "రాజా! నీ దుఃఖాన్ని ఈ క్షణంలోనే పోగొడతాను. ముందు నీకెందుకు దుఃఖం కలిగిందో చెప్పు. నీవెవరికి సంబంధించినవాడవు? దుఃఖం దేనికి సంబంధించింది? నీకూ, దుఃఖానికి ఏమిటి సంబంధం? ఈ విషయం సమగ్రంగా ఆలోచించుకో".

అలర్కుడి ఆత్మపరిశీలన :

ఆ మహాపీయుడు చెప్పిన మాటలు విని రాజు తీవ్రంగా ఆలోచించాడు. అన్ని దుఃఖాలకూ కేంద్రమైన తన్ను గురించి తాను విచారణ చేశాడు. చాలసేపు తనలో తాను విమర్శించుకొని చివరికి నవ్వుతూ ఇలా అను కొన్నాడు -

"పృథివి, జలం, తేజస్సు, వాయువు, ఆకాశం అనే పంచభూతాలలో నేనేదీ కాను. వీటి చేరిక వల్లనే యీ శరీరం ఏర్పడింది. అందువల్లనే శరీరం భౌతికభోగాల నపేక్షిస్తుంది. నేను కేవలాత్మస్వరూపుణ్ణి. సుఖ దుఃఖాలతో నాకు పనిలేదు.

పుట్టూ, చస్తూ, పెరుగుతూ, తరుగుతూ సదా పరిణామాలకు గురి అవుతున్న ప్రపంచాన్ని పరికించేవాడు మమకారాసక్త లోము గాడు. మమకారం లేని వాడికి సుఖదుఃఖాలంటవు. సుఖమైనా, దుఃఖమైనా మనస్సుకు సంబంధించినవే. నేను మనస్సును కాను. అందుచేత నాకు సుఖదుఃఖాలు లేవు. మనస్సు, బుద్ధి, అహంకారం - వీటికి అతీతుణ్ణి నేను. అందువల్ల అంతఃకరణంలో కలిగే దుఃఖం నాకంటదు. మనస్సుకూ, శరీరానికీ సంబంధించిన సుఖదుఃఖాలు మనశ్శరీరాలకే అగుగాక! వాటితో నాకేమిపని?

ఆత్మకు రాజ్యకాంక్ష లేదు. దేహం పంచభూతాత్మకం కాబట్టి జడం. దానికి రాజ్యంతో పనిలేదు. త్రిగుణాత్మకమైన దేహం కంటే నేను భిన్నుణ్ణి

ఆత్మస్వరూపుడైన నాకు ఈ కరచరణాద్యవయవాలతోనూ, చక్షుర్మాంసాదుల తోనూ సంబంధం లేదు. ఇక గుర్రాలు, ఏనుగులు, రథాలు ధనాగారాలు మొదలైన వాటితో మాత్రం సంబంధం ఎలా వుంటుంది?

నాకు శత్రువులు లేరు, పైశ్వం లేదు, పట్టణం లేదు, సుఖం లేదు, దుఃఖం లేదు. ఇదంతా మిథ్య.

ఆకాశం ఒక్కటే కాని, కడవ, ముంత, మూకుడు మొదలైనవాటిలో ఆ యా ఆకారాన్ననుసరించి వేరువేరుగా భాసిస్తుంది. అలాగే సుబాహుడు, కాశీరాజు, నేనూ శరీరభేదంతో వేరుగావున్నా వాస్తవికదశలో మాకు భేదం లేదు. ఉన్నది ఒకే సద్వస్తువు. అదే అంతటా వుంది"

## ఎవరికి సుఖదుఃఖాలు?

ఇలా భావించి అలర్కుడు దత్తాత్రేయమునీంద్రుడికి నమస్కరించి ఇలా చెప్పారు –

"మహాత్మా! చక్కగా వివరించి చూశాను. నా దుఃఖమంతా పటాపంచలయింది. సత్యాన్ని చూడలేనివారే దుఃఖసాగరంలో మునిగి పోతారు. బాహ్యపదార్థాలపై మమకారం పెంచుకొన్నవాడికే దుఃఖాలు కలుగుతాయి. పిల్లి కోడిని చంపి తినివేస్తే గృహస్థులు దుఃఖిస్తారు. అదే పిల్లి ఇంటిలోని పిచ్చుకనో, ఎలుకనో తింటే దుఃఖించరు. దుఃఖానికి

హేతువు కోడిపైవున్న మమకారమే. ప్రకృతిబద్ధులైన వారికే సుఖదుఃఖాలు. నేను ప్రకృతికంటే పరుణ్ణి. కాబట్టి నాకు సుఖదుఃఖాలు లేవు".

## దత్తాత్రేయుని ధర్మోపదేశం:

అలర్కుడి మాటలకు దత్తాత్రేయుడు సంతోషించి ఇలా అన్నారు –

"రాజా! నీవు చెప్పింది నిజం. మమత్వమే దుఃఖానికి మూలం. నిర్మమత్వమే సుఖహేతువు. నేను నిన్నడిగిన చిన్న ప్రశ్నవల్లనే నీలోని మమకారం గాలిలో బూరుగుదూదిలా ఎగిరిపోయింది.

అజ్ఞానవృక్షానికి అహంకారం అంకురం, మమకారం స్కంధం, దారాపుత్రాదులు చిగుళ్లు, పుణ్యపాపాలే పుష్పాలు, సుఖదుఃఖాలే ఫలాలు. ఆ చెట్టు మోక్షమార్గానికి అడ్డుగా పెరిగివుంది. సంసారమార్గంలో పయనించే బాటసారులు ఆ చెట్టుక్రింద విశ్రమిస్తారు. ఎవరు సత్సంగమనే సానరాతిపై నూరి పదునెక్కించిన జ్ఞానమనే గొడ్డలితో అజ్ఞానవృక్షాన్ని నరికివేస్తారో వాళ్లు ఆ మార్గంలో పయనించి ముక్తిసౌధం చేరుకొంటారు. వృత్తి శూన్యులైన ప్రాజ్ఞులు అక్కడ నిత్యసుఖంలో ఓలలాడుతూ వుంటారు.

ఈ శరీరమనే క్షేత్రం గుణసంఘాతం. దీనికంటే పరుడు క్షేత్రజ్ఞుడు. మేడిపండూ, అందలి దోమలూ, దర్భ దాని ముంజా, నీరూ అందలి చేపలూ ఒకటిగా వున్నట్లు కనిపించవచ్చు. కాని నిజానికవి వేఱు వేఱైనవే కదా! అలాగే దేహం, ఆత్మ ఒకటిగా వున్నట్లు తోచినా వేరైనవే"

తర్వాత అలర్కుడు ఆ మునీంద్రుణ్ణి ఇలా ప్రార్థించాడు – "మహాత్మా! మీ అనుగ్రహంవల్ల నాకు ప్రకృతిపురుషులను వేరుపరచే విజ్ఞానం కలిగింది. కాని విషయసుఖాలవైపు పరుగెత్తే మనస్సుకు నిలకడ కుదరడంలేదు. అందుకు తగిన యోగం దయతో బోధించి నన్ను కృతకృత్యుణ్ణి చేయండి!"

యోగతత్త్వ నిరూపణ:

మునీంద్రుడు అతనికిలా బోధించాడు – "జ్ఞానంతో జ్ఞానపూర్వకమైన వియోగమే ముక్తి. ప్రాకృతగుణాలతో సంబంధం వదిలి బ్రహ్మతో ఐక్యం పొందడమే ముక్తి. దానికి తగిన సాధనం యోగం.

సమ్యక్ జ్ఞానం వల్లనే యోగం సిద్ధిస్తుంది. మమకారం కలవాళ్లకు సంగదోషంవల్లనే దుఃఖం కల్గుతుంది. అందువల్ల ముముక్షువు సంగం వదలుకోవాలి. సంగం లేకపోతే మమత్వం నశిస్తుంది. మమత్వాభావమే సుఖానికి మూలం.

విషయాలపై దోషదృష్టి వైరాగ్యం వల్లనే కల్గుతుంది. జ్ఞానంవల్ల వైరాగ్యం, వైరాగ్యంవల్ల జ్ఞానమూ సిద్ధిస్తాయి. ఇవి రెండూ అన్యోన్యాశ్రయాలు. యోగికి తానెక్కడ నివసిస్తాడో అదే గృహం, దేనితో శరీరం నిలుపుకొంటాడో అదే భోజనం, ఏది ముక్తికి సాధనమో అదే జ్ఞానం.

నిష్కామంగా కర్మలు అనుష్ఠించాలి. పుణ్యపాపానుభవంతో పూర్వ కర్మఫలాలను అనుభవించాలి. క్రొత్తగా కర్మఫలాలను ఆర్జించగూడదు. అప్పుడే మోక్షం సిద్ధిస్తుంది. దుష్కర్మల వల్ల అధోగతి తప్పదు.

యోగి మొదట మనస్సును జయించాలి అందుకు ప్రాణాయా మాదులు తగిన సాధనాలు. ప్రాణాపాననిరోధరూపమైన ప్రాణాయామంవల్ల ఇంద్రియదోషాలు నశిస్తాయి. విషయాలనుండి ఇంద్రియాలను మరలించడం ద్వారానూ, ప్రాణమనస్సులను నిగ్రహించడంద్వారానూ ప్రత్యాహారానికి ఉపక్రమించాలి. తాబేలు తన అవయవాలను లోపలికి ముడుచుకొన్నట్లు సమస్తకామాలనూ ఉపసంహరించుకొని, ఎల్లప్పుడూ ఆత్మరతిగల్గి తనలో తన్ను చూచుకొంటూ, బాహ్యాభ్యంతర శౌచంతో ప్రత్యాహారం చెయాలి.

పండ్రెండు ప్రాణాయామాలను ఒక ధారణ అంటారు. మనస్సు ఇందులో ధరింపబడుతుంది. కాబట్టి దీనికి ధారణ అని పేరు. యోగాభ్యాస కాలంలో యోగులు అలాంటి రెండు ధారణలను అనుష్ఠించాలి. అప్పుడే సకలదోషాలూ నశించి స్వస్వరూపంలో నిలకడ కలుగుతుంది.

దప్పిగొన్నవారు నాళంద్వారా మెల్లగా పానీయం పీల్చుకొన్నట్లు యోగి వాయువును పీల్చుకోవాలి. వానితో మొదలుపెట్టి దశవిధధారణలను అనుష్ఠించినవాడు అక్షరస్వరూపుడవుతాడు.

తీపన, ఆకలి, అలసట, మనోవ్యాకులత లేని సమయంలో యోగాన్ని పరిశీలించాలి. చలి, వేడిమి, గాలి ఎక్కువగా వుండేచోటా, ఇతరవిధాల విఘ్నకరమైనచోటా యోగాభ్యాసం తగదు. మౌర్ఖ్యంతో శాస్త్రవిధిని దాటి యోగాపికి పూనుకుంటే వివిధ రోగాలు కల్గుతాయి.. ప్రమాదవశాత్తూ ఏదైనా రోగంవస్తే అందుకు తగిన చికిత్స యోగపద్ధతిలోనే చేయాలి. ధర్మార్థ కామమోక్షాలకు శరీరమే సాధనం. అది రోగాలపాలు కాకుండా చూచు కోవాలి.

యోగికి కొన్ని మహిమలు సిద్ధిస్తాయి. వాటిని ప్రకటించకుండా గుప్తంగా ఉంచుకోవాలి. లేకపోతే విజ్ఞానం నశిస్తుంది. అచాపల్యం, ఆరోగ్యం, మృదుత్వం, ప్రసన్నత, సౌమ్యత మొదలైనవి యోగచిహ్నాలు. ఉత్తమయోగసిద్ధునిపట్ల ప్రజలు అనురక్తితో వుంటారు. పరోక్షంలో అతణ్ణి కీర్తిస్తారు. శీతోష్ణాలూ, సుఖదుఃఖాలు మొదలైన ద్వంద్వాలకు అతీతుడైన వాడికి యోగసిద్ధి కరతలామలకమవుతుంది.

యోగమార్గంలో పయనించేవాడికి ఎన్నో విఘ్నాలు ఎదురవుతాయి. వాటి కన్నిటికీ తట్టుకొని దృఢమైన మనోనిగ్రహం కల్గివుండాలి. మనస్సును బ్రహ్మమందే నిల్పినవాడికి విఘ్నాలు దూరమవుతాయి. విఘ్నపరంపరను స్థిరచిత్తంతో ఎదుర్కోలేనివాళ్ళు సంసారసాగరంలో పడిపోతారు.

యోగికి అణిమాదులైన ఎనిమిదిసిద్ధులు కలుగుతాయి. కాని వాటి వల్ల నిర్వాణస్థితి కలగదు. యోగాగ్నితో సమస్తదోషాలనూ కాల్చివేయాలి. అపుడు యోగి బ్రహ్మంతో ఐక్యమవుతాడు. నీళ్లు నీళ్లతో కలసిపోయినట్లే యోగి బ్రహ్మంతో లీనమవుతాడు ''

తర్వాత యోగుల నడవడి యెట్లుంటుందో తెలపండని అలర్కుడు ప్రార్థించాడు. దత్తాత్రేయుడు ఇలా ఉద్బోధించాడు.

**యోగుల నడవడి :**

" రాజా ! సామాన్యజనులు అవమానాన్ని విషంగానూ, సన్మానాన్ని అమృతంగానూ భావిస్తారు. కాని యోగి అవమానాన్ని అమృతంగానూ, సన్మానాన్ని విషంగానూ భావిస్తాడు. అతడు అసత్యమాడడు. పరిశుద్ధ మైన బుద్ధితో ఆలోచిస్తాడు. జనసమ్మర్దం ఎక్కువగావుండే ఉత్సవాదులు జరిగే చోటికి పోడు. ఏకాంతంలో ధ్యాననిమగ్నుడై వుంటాడు. ఇతరులు తన్ను తిరస్కరించినా సాధుమార్గం వదలడు. సాత్త్వికాహారం మితంగా స్వీకరిస్తాడు. అహింస, బ్రహ్మచర్యం, త్యాగం మొదలైన వ్రతాలు పాటిస్తాడు.

ఒక్క ఆత్మజ్ఞానమే అతని లక్ష్యం. సమస్తమూ అతనికి ఆత్మ మయంగానే కనిపిస్తుంది. అందువల్ల ఇది ప్రియమూ, అది అప్రియమూ అన్న భావం యోగికి వుండదు. అతడు సమస్తప్రాణులలోనూ సమత్వబుద్ధికలి

వుంటారు. శ్రేష్ఠాతి శ్రేష్ఠమైన జ్ఞానమార్గం అవలంబించి పునరావృత్తిలేని శాశ్వతస్థానం చేరుకొంటారు.

బ్రహ్మప్రాప్తికై యోగి ప్రణవాన్ని అనుసంధిస్తాడు. ఓంకారమనే ధనుస్సుతో ఆత్మ అనే బాణాన్ని అనుసంధించి పరబ్రహ్మమనే లక్ష్యాన్ని గురిపెట్టి కొట్టాలి అప్పుడు ఆత్మ బ్రహ్మలో లీనమవుతుంది. మూడు వేదాలూ, మూడు లోకాలూ, మూడు అగ్నులూ, త్రిమూర్తులూ ఇదంతా ఓంకారమే. అక్షరమైన పరబ్రహ్మకు ఓంకారమే వాచకం. ఈ రహస్యం తెలిసినవాడు సంసారచక్రం వదలి పరమాత్మలో లీనమవుతాడు.

చంద్రకిరణసంయోగంతో చంద్రకాంతమణి ద్రవిస్తుంది అట్లే పరమాత్మసంయోగంతో యోగి చైతన్యం పొందుతాడు. సూర్యకిరణ సంయోగంతో సూర్యకాంతమణి జ్వలిస్తుంది. అలాగే పరమాత్మసంయోగం వల్ల యోగిలో జ్ఞానజ్యోతి భాసిస్తుంది.

ఇల్లు తగలబడితే ఇంటియజమాని దుఃఖిస్తాడు. అంతవరకూ అతనితోగూడ ఆ యింటిలోనేవుండిన ఎలుకలూ, పిచ్చుకలూ, బల్లులూ మొదలైనవి దుఃఖించవు. అవి మరొక యిల్లు చూచుకొంటాయి. అలాగే యోగికి దేహిపైనా మమకారం వుండదు కాబట్టి దేహికి నష్టం వాటిల్లినా అతడు దుఃఖించడు.

చెదపురుగులు చిన్న చిన్న మట్టిపెళ్లలతో పెద్ద పెద్ద పుట్టలను సృష్టిస్తాయి. అలాగే యోగి చిన్నచిన్న అనుష్ఠానాలతో ప్రారంభించి క్రమంగా మహోలక్ష్యమైన మోక్షాన్ని సాధిస్తాడు.

పరోపకారార్థం చెట్లు పత్రపుష్పఫలాలను త్యాగం చేస్తాయి. యోగి కూడా అలాగే లోకసేవకై తన సర్వస్వాన్నీ త్యజిస్తాడు. కరచరణాద్య వయవాలతో మనుజుడు పని నెరవేర్చినట్లే యోగి బుద్ధ్యాదిసాధనాలతో పరాన్ని సాధిస్తాడు. అలాంటి యోగికి ఇక మమకారం ఎక్కడ వుంటుంది?"

అలర్కుని ఆనందం:

దత్తాత్రేయమహర్షి చేసిన మహోపదేశం అలర్కుడికి అమందా నందాన్ని కల్గించింది. అతడు మునీంద్రుడికి భక్తితో నమస్కరించి ఇలా విన్నవించాడు —

"మహాత్మా! నేను ధన్యుణ్ణి. నా అదృష్టం బాగుండటంవల్లనే శత్రువులు నాపై దండెత్తారు. నాకు కల్గిన కష్టాలన్నీ నా అదృష్టవశాలే లేకపోతే మీ పాదాలను ఆశ్రయించే భాగ్యం నాకు కల్గివుండదు.

మీ సాంగత్యంవల్ల నాకు జ్ఞానోదయమయింది. నా పూర్వపుణ్యం వల్లనే మీదయకు నేను పాత్రుణ్ణయ్యాను. శుభోదయకాలంలో కీడు కూడా మేలుగానే పరిణమిస్తుంది. నా వ్యసనం మీ సాంగత్యానికి హేతువై నన్ను కాపాడింది.

సుబాహువూ, కాశీరాజూ ఇద్దరూ నాకు ఉపకారులే. వారివల్లనే నాకు మీ దర్శనభాగ్యం ప్రాప్తించింది. మీ అనుగ్రహంవల్ల నేను దుఃఖాతీతస్థితి పొందాను. ఓ జ్ఞానదాతా! మీ అనుమతితో నేనిక దుఃఖహేతువైన గృహస్థాశ్రమాన్ని వదలిపెడతాను".

తర్వాత దత్తాత్రేయుడు అలర్కుణ్ణి అహంకార మమకారాలకు లోనుకాకుండా జీవించి ముక్తి పొందమని ఆశీర్వదించారు.

ఆయన అనుజ్ఞతో అలర్కుడు వెంటనే కాశీరాజు ఉన్నచోటికి వెళ్ళారు. అతనితో సుబాహువు వింటూవుండగా నవ్వుతూ—

**ఇదిగో రాజ్యం స్వీకరించు:**

"ఓ కాశీరాజా! నీవు రాజ్యంకావాలన్న కోరికతో నాపై దండెత్తావు. ఇదిగో ఈ రాజ్యం నీ స్వాధీనం చేస్తున్నాను. ఇక దీన్ని యథేచ్ఛగా అనుభవించుకో, లేదా సుబాహువుకైనా సమర్పించు" అని చెప్పారు.

అందుకు కాశీరాజు "అలర్కా! యుద్ధం చేయకుండా రాజ్యం ఎందుకు వదులుతున్నావు? ఇది క్షత్రియధర్మం కాదు సుమా! చావుకు భయపడకుండా రాజు శత్రువులపై కత్తి దూయాలి. వాళ్ళను సంహరించి రాజ్యం అనుభవించాలి. దీనికి విరుద్ధంగా ఎందుకు ప్రవర్తిస్తావు?'' అని అన్నారు.

అలర్కుడిలా సమాధానం పలికాడు– "వీరాగ్రణీ! పూర్వం నా అభిప్రాయం కూడా ఇప్పుడు నీవు చెప్పినట్లే వుండేది. కాని ఇప్పుడు అందుకు విరుద్ధంగా మారింది. కారణం చెబుతా విను.

పంచభూతాలూ, వాటివల్ల కలిగే తత్త్వాలూ మానవుల కున్నట్లే సమస్త ప్రాణులకూ వున్నాయి. అన్ని ఉపాధులలోనూ వున్న చిచ్ఛక్తి మాత్రం ఒక్కటే. ఈ జ్ఞానం కల్గినవాడిలో శత్రుత్వమిత్రత్వాలకు స్థానం లేదు. నీ వల్ల భయపడి నేను దుఃఖానికి గురి అయ్యాను. కాని దత్తాత్రేయమహర్షి అనుగ్రహం వల్ల నాకు జ్ఞానోదయ మయింది. నేనిప్పుడు మనస్సును జయించాలని అభిలషిస్తున్నానే కాని శత్రువులను జయించాలని అనుకోవటం లేదు. నీవు నాకూ, నేను నీకూ శత్రువులం కాము. ఈ సుబాహువు నాకు అపకారి కాడు. మీ వల్ల నాకు మహోపకారమే జరిగింది. అవసరమైతే నీవు మరొక శత్రువును అన్వేషించుకో!"

అలర్కుడి మాటలు విని సుబాహువు హర్షంతో ఉప్పొంగిపోయాడు. సోదరుణ్ణి అభినందించి కాశీరాజుతో ఇలా అన్నాడు—

నా లక్ష్యం నెరవేరింది:

"రాజా! నేను నిన్ను ఏ వుద్దేశంతో ఆశ్రయించానో, ఆ వుద్దేశం నెరవేరింది. ఇక నేను వెళ్ళివస్తాను నీవు సుఖంగా వుండు!"

అప్పుడు కాశీరాజు విశ్రాంతి చెంది సుబాహువుతో ఇలా అన్నాడు-

"అయ్యా! మహాత్మా! నీవు నన్నెందుకు ఆశ్రయించావు? ఇప్పుడు నీకు కలిగిన లాభం ఏమి? రాజ్యంకొరకు గదా నీవు నన్ను యుద్ధానికి సిద్ధం చేశావు. నాకేమీ గోచరం కావడంలేదు. నీ కోరిక ప్రకారం నీ తమ్ముణ్ణి జయించి రాజ్యం నీకు స్వాధీనం చేస్తున్నాను అనుభవించుకో!"

**మళ్లా గర్భనరకం ఉండకూడదు:**

అందుకు సుబాహువు అతనితో ఇలా చెప్పాడు—

"కాశీరాజా! నేనెందుకిలా చేశానో నిజం చెబుతా విను. నాకింకా ఇద్దరు సోదరులు ఉన్నారు మా తల్లి మాకు బాల్యంలోనే తత్త్వబోధ చేసింది. అలర్కుడికి మాత్రం ఆమె తత్త్వోపదేశం చేయలేదు. అందువల్ల ఇతడు జ్ఞానహీనుడై భోగలాలసుడయ్యాడు. ఇతని విషయంలో నాకెంతో జాలి కలిగింది. ఇతనిలో వైరాగ్యం పురికొల్పటానికి నేను నిన్ను ఆశ్రయించాను. మదాలస గర్భంలో పుట్టినవారు ఇతరస్త్రీల బిడ్డలలాగా మళ్ళీ గర్భయాతన అనుభవించకూడదని ఇలా చేశాను

ఒకడు చెడిపోతుంటే వాణ్ణి బాగుచేయకుండా ఊరికే చూచేవాడు జీవచ్ఛవమే. భ్రష్టుడైపోతున్నవాణ్ణి చక్కదిద్దాలి. లేకపోతే ఆ దోషం ఉపేక్షకులకే చెందుతుంది. నీ సహాయంతో ఇప్పుడు నా సంకల్పం నెరవేరింది. నీకు శుభమగుగాక! ఇక నా దారిన నేను పోతాను."

సుబాహువు మాటలు వినగానే కాశీరాజులో గూడా జ్ఞాన రేకెత్తింది అంచేత అతడిలా అన్నారు —

మహాశయా! అలర్కుడికి మహోపకారంచేసి అతణ్ణి ఉద్ధరించావు. నాకూ అలాంటి ఉపకారం చేయరాదా? సత్సాంగత్యం సత్ఫలాన్ని ప్రసాదిస్తుందంటారు. మరి మీ సహవాసం వల్ల నేను బాగుపడవద్దా?"

సుబాహుని ఉపదేశం:

అప్పుడు సుబాహువు కాశీరాజు నుద్దేశించి ఈ విధంగా ఉపదేశించాడు-

"రాజా! సంగ్రహంగా నీకు తత్త్వం వివరిస్తాను. మొదట అహంకార మమకారాలను వదలాలి. 'నే నెవరను?' అన్న విచారణతో నీవు నీ యథార్థస్వరూపం అవగతం చేసుకోవాలి. ఆ తెలుసుకొనే 'జ్ఞాత' నీవేనా? లేక నీ కంటే వేరుగా మరొకరున్నారా? అని పరిశీలించుకోవాలి. ఇది తెలుసుకొంటే అంతా తెలుసుకొన్నట్లే.

అనాత్మను ఆత్మ అనుకోవడం, తనది కానిదాన్ని తనదనుకోవడం కంటే మౌర్ఖ్యం ఇంకేమున్నది? రాజా! నేను సర్వగతుణ్ణి. నా కంటే వేరుగా ఏమీ లేదు. నీలో వున్నది కూడా నేనే. చెప్పేవాడూ వినేవాడూ వేరు వేరు

కారు. అయినా వ్యావహారికస్థితిలో నీ వడిగావు కాబట్టి నేను చెప్పాను. ఇక నేను వెళ్తున్నాను."

ఇలా చెప్పి సుబాహువు తన దారిన తాను పోయాడు. కాశీరాజు అలర్కుణ్ణి సత్కరించి తానూ తన నగరానికి వెళ్లాడు.

అలర్కుని యోగనిష్ఠ :

తర్వాత అలర్కుడు తన జ్యేష్ఠపుత్రుణ్ణి రాజ్యాభిషిక్తుణ్ణి చేశాడు. సర్వసంగపరిత్యాగం చేసి మోక్షాపేక్షతో తపోనుష్ఠానానికై అడవికి వెళ్లాడు అక్కడ చిరకాలం తపశ్చర్యలో గడిపి మహాయోగశక్తి సంపన్నుడయ్యాడు. ద్వంద్వాతీతస్థితి పొందాడు.

యోగసిద్ధుడైన అలర్కుడు దుఃఖమయమైన ప్రపంచాన్ని గురించి, దుఃఖాతీతస్థితిని పొందిన తన్ను గురించి పరామర్శించుకొని ఈ క్రింది విధంగా తన అనుభవాన్ని గానం చేశాడు —

"అహో! కష్టం యదస్మాభిః
పూర్వం రాజ్య మనుష్ఠితమ్।
ఇతి పశ్చాన్మయా జ్ఞాతం
యోగాన్నాస్తి పరం సుఖమ్।"

"ఔరా! పూర్వం రాజ్యపాలన కాలంలో నేను పొందిన కష్టమెంత? ఇప్పుడు యోగాభ్యాసంతో నా స్వరూపం నేను గుర్తించాను. యోగం కంటే పరమ సుఖం మరొకటి లేదని తెలుసుకొన్నాను."

ఇలా మదాలస సంతానమంతా వైరాగ్యంతో మోక్షమార్గాన్ని అనుసరించింది.

T.T.D. Religious Publication Series No. : 77
Price : Rs. 1/-

Published by Sri Ajeya Kallam, I.A.S., Executive Officer,
Tirumala Tirupati Devasthanams, Tirupati and Printed at
Sri Venugopala Offset Printers Ph : (0866) - 5511302.